


అనంతగిరిలో వర్షం

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. మారో పక్క ఎత్తైన కొండ శిఖరాలు పొగ మంచుతో పర్యాటకులకు కనువిందుల చేస్తున్నాయి. ఘాట్ రోడ్డు, శివలింగపురం, డమ్ముకు, అనంతగిరి మీదుగా అరకు వరకు వాహనచోదకులు లైట్లు వెలిగించి నడుపుతూన్నారు. ఉదయం ఆకాశమంతా మబ్బులతో కమ్మి, మధ్యాహ్నం తర్వాత కుండపోత వాన కురిసింది. దీంతో రైతాంగం వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారు.



కురుస్తున్న వర్షం

పాఠశాలలు కూలిపోతున్నా..
కన్నెత్తి చూడరా...

-రేకుల షెడ్లు, శిథిల భవనాల్లోనే చదువులు - భయాందోళనలో తల్లిదండ్రులు



అరకులోయ మండలం ఇగరాయిలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం



ముంచంగిపుట్టు మండలం ముండిగుమ్మలో శిథిలమైన పాఠశాల భవనం

ముంచంగిపుట్టు మండలంలోని వనమసింగి గ్రామ పంచాయతీకి చెందిన తొంగికోట గ్రామంలోని ఎంపీపీ స్కూల్లో మంగళవారం పెను ప్రమాదం తప్పింది. గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు టొంగికోట ఎంపీపీ పాఠశాల భవనం నేల మట్టమైంది. ఈ పాఠశాలలో 23 మంది విద్యార్థులు విద్యనభ్యాసిస్తున్నారు. ఆ రోజు ఐచ్ఛిక సెలవు కావడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది.

జిల్లాలోని ఇదే తరహాలో పలు మండలాల్లోని పాఠశాలలు ఉన్నాయి. ఆ భవనాలు ఎప్పుడు కూలి పోతాయోనని భయాందోళనలో తల్లిదండ్రులు ఉన్నారు. అయినా అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడలేదు. పాఠశాలల దుస్థితిపై ప్రజాశక్తి ప్రత్యే కథనం....

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

హుకుంపేట: మండలంలోని మెరక చింత పంచాయతీ రంగసింగపాడు గ్రామంలోని జిపిఎస్ పాఠశాల రేకుల షెడ్డులో విద్యాబోధన నిర్వహిస్తున్నారు.
ఈ పాఠశాలలో ఒక టీచర్, పది మంది పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రేకు షెడ్డు కారుతోంది. 2007 సంవత్సరం కాలంలో పూరి గుడిసె ఏర్పాటు చేసి సుమారు 14 సంవత్సరాల వరకు విద్యా బోధన నిర్వహించారు. అది కాస్త కూలి పోవడంతో 2021 సంవత్సరం నుంచి ఊరు పక్కన రేకుల షెడ్డు ఏర్పాటు చేసి ప్రస్తుతం విద్యా బోధన అందిస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే విద్యార్థులకు సెలవు కూడా ఇస్తున్నారు. గతంలో పాఠశాల భవనం మంజూరైనప్పటికీ పనులు పూర్తికాక నత్త నడకన సాగుతున్నాయి. గత్యంతరం లేక విద్యార్థుల తల్లిదండ్రులు చిన్న రేకు షెడ్డు ఏర్పాటు చేసి పాఠశాల నడుపుతున్నారు.

గన్నేరుపుట్టు పంచాయతీ డొంకినవలస ఎంపీపీ పాఠశాలలో ఇదే మాదిరిగానే ఉంది. 28 మంది పిల్లలు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఎనిమిది సంవత్సరాలు పాటు పెంకుల పూరి గుడిసెలో గతంలో విద్యాబోధన నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు కలిసి ఐరన్ రేకు షెడ్డు ఏర్పాటు చేసి విద్యా బోధన చేస్తున్నారు. గట్టిగా వర్షాలు కురిస్తే విద్యార్థులకు తప్పడం లేదు. గతంలో పాఠశాల భవనం మంజూరైనప్పటికీ నత్తనడకన పనులు సాగుతున్నాయి. నేటికీ పూర్తికాలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వాలు మారినా పాఠశాలల భవనాల నిర్మాణం చేపట్ట లేదు.



హుకుంపేట మండలం రంగసింగపాడు పాఠశాలలో చేరిన వర్షపు నీరు

ముంచింగిపుట్టు: మండలంలోని అతిమారుమూల ప్రాంతమైన బాబుసాల పంచాయితీకి చెందిన ముండిగుమ్మ గ్రామంలో పి టి జి కోదు తెగకు చెందిన ఆదివాసి గిరిజనలు 33 గహాలలో 172 జనాభ కలిగి నివసిస్తున్నారు . వీరిలో 21 మంది చిన్నారులు పాఠశాలలో చదువుతున్నారు. గ్రామంలో ఎంపీపీ పాఠశాల శిథిలావస్థకు చేరిందని బుధవారం ఆ గ్రామస్తులు పాంగి బాలన్న, జి.నరేష్. గ్రామస్తులు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం..
ఈ గ్రామంలో రెండు గదులు కలిగిన పాఠశాల భవనం ప్రభుత్వం నిర్మించి విద్యా బోధన కొనసాగిస్తుంది. కొన్నేళ్ల క్రితమే భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలకు పాఠశాల పై కప్పు రేకులు ఒక గదిలో ధ్వంసమైంది. ధ్వంసమైన పాఠశాల భవనంలో మరోవైపు గదిలో రేకులను సక్రమంగా అమర్చి, రేకులపైకి టార్పలిన్‌లు కప్పి, గాలికి ఎగరకుండా రాళ్లపెట్టి విద్యా బోధన కొనసాగిస్తున్నారు..ఈ నేపథ్యంలో గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పాఠశాల భవనం కూలి నేల మట్టం అయ్యే పరిస్థితి నెలకొంది. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనంలోనే విద్యార్థులకు ప్రస్తుతం విద్యాబోధన కొనసాగుతోంది. దీంతో, ఎప్పుడు ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందో అని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.ఆదివాసి గిరిజన ప్రాంతంలో విద్య, వైద్యం, రోడ్డు, తాగునీటి సౌకర్యాలపై అధికారులు దృష్టి పెట్ట లేదని ఆ గ్రామ ప్రజలు విమర్శించారు. ఇప్పటికైనా ముండిగుమ్మ గ్రామంలో ఎంపీపీ పాఠశాల నూతన భవన నిర్మాణాలకు నిధులు కేటాయించి, తక్షణమే చేపట్టాలని గ్రామస్తుడు కొర్ర సుబ్బారావు, విద్యా కమిటీ చైర్మన్ జి నరేష్, గ్రామస్తులు పాంగి ధనుర్జయ్ , కె చలపతి, కే సైబు, కే.బాలన్న, కే తిప్పాయి, కే.సువర్ణ , జి.సీతమ్మ ప్రభుత్వాన్ని కోరారు.

అరకులోయరూరల్: అరకులోయ మండలం ఇరగాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది.ఈ పాఠశాలలో ఒక్కటి తరగతి నుండి 5వ తరగతి వరకు 25 మంది విద్యార్థులు చదువుతున్నారు.పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి పెచ్చులూడి, వర్షం వస్తే కారి పోతుంది. దీంతో తరగతి గదిలో నీరు నిలిపోతుంది. ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గతంలో నాడు-నేడు పథకంలో విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని పాలకులు గొప్పలు చెప్పినా ఇరగాయి పాఠశాలను మాత్రం ఎవ్వరు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపించారు.
ఈ పాఠశాల భవనం శ్లాబ్ పెచ్చులూడి పడిపోతున్నాయి. పిల్లలు గాయాలపాలవుతారేమోనని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.వర్షం వస్తే భవనం గోడలు నానిపోతున్నాయి. నూతన ప్రభుత్వమైన స్పందించి పాఠశాల భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



హుకుంపేట మండలం రంగసింగపాడులో రేకుల షెడ్డులో పాఠశాల



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే శిరీషారాణి

గురుకుల విద్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు మఠం విజయభాస్కర్ బుధవారం రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలను సందర్శించారు. కళాశాల భోజనశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు భోజనం చేసే సమయం కావడంతో ఎమ్మెల్యే శిరీషాదేవి వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యాలయం ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నీటి సమస్య ఉందని, పాఠశాల ప్రాంగణంలో కోతుల బెడద ఎక్కువ ఉండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రధాన సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత శాఖ అధికారులకు, లేదా లిఖితపూర్వకంగా తనకు ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ప్రసూన, డిప్యూటీ వార్డెన్ పద్మావతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పివై.భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం, సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు సలాది బాపిరాజు పాల్గొన్నారు.



చింతూరులో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి-చింతూరు

విశాఖపట్నంలో జరిగిన మీడియా సమావేశంలో జర్నలిస్టులపై వైసిపి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై పాత్రికేయులు చింతూరు ప్రధాన రహదారి కూడలి వద్ద బుధవారం నిరసన తెలిపారు. జర్నలిస్టులను దుర్భాషలాడుతూ దూషించిన విజయసాయిరెడ్డిపై తక్షణమే కేసు నమోదు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయసాయిరెడ్డి జర్నలిస్టులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతూరు మండల పాత్రికే మా యులు విజయ్, జాని, సత్యనారాయణ, షాజహాన్, చంటి, నరేష్, నరసింహరావు, ఆసీఫ్, రామారావు, పిన్ను, శ్రీనివాసాచారి, ఈశ్వర చారి, రియాజ్, జీవన్, ఫిరోజ్, సత్య తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : జర్నలిస్టుల పట్ల వైసిపి ఎంపీ విజయసాయి రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను విఆర్.పురం వివేకానంద ప్రెస్‌క్లబ్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. మండల కేంద్రంలోని కెవిఆర్ కళాశాలలో బుధవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడుతూ గౌరవప్రదమైన వృత్తిలో కొనసాగుతున్న పాత్రికేయుడిని అగౌరపర్చడం దారుణమన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు మస్కపల్లి సత్తిబాబు, దాన్నాన రామారావు, కప్పల కృపారావు, నాగేంద్రబాబు, గోలి వికాస్, నరేష్, పాల్గొన్నారు.

18 నుండి జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : జనసేన పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 18 నుండి 28వ తేదీ వరకు పది రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షులు మళ్ల దుర్గా ప్రసాద్, యూత్ ప్రెసిడెంట్ బి.సత్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యత్వం తీసుకున్నవారికి రూ.5లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని, ప్రమాదంలో గాయపడిన వారికి రూ.50వేలు ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. మండలంలోని జనసేన కార్యకర్తలు రూ.500 చెల్లించి సభ్యత్వం నమోదు చేసుకోవాలని సూచించారు. దీనిని ప్రతి కార్యకర్త వినియోగించుకోవాలని కోరారు.

అధ్వానంగా గడిమండ - గరికిబంద రోడ్డు

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం మారుముల బూదరాళ్ళ పంచాయతీ పరిధి గరిమండ, జికె.వీధి మండలం గరికిబంద గ్రామాల మధ్యలో ఉన్న మట్టి రహదారి అత్యంత అధ్వానంగా ఉంది. మూడేళ్ల క్రితం ఈ గ్రావెల్ రోడ్డును నిర్మించారు. నాటి నుండి దీనిని తారురోడ్డుగా ఏర్పాటు చేయలేదు. ప్రతి ఏటా వర్షా కాలంలో రోడ్డు అధ్వానంగా తయారైనా, పట్టించుకున్న నాధుడే లేరని ఆ ప్రాంతం గిరిజనులు తెలిపారు. అనేకమార్లు ఈ రోడ్డుని గరిమండ గ్రామస్తులు శ్రమదానంతో మరమ్మతులు చేస్తూ వాహనాల రాకపోకలు సాగిస్తున్నారు, ప్రస్తుతం బిఎస్ఎన్ఎల్ పైప్ లైన్లు ఆ రోడ్డు పక్కగా నిర్మించడంతో పాటు వర్ష కాలం కావడంతో ఉన్న కాస్త రోడ్డు కూడా అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో ప్రయాణం చేయలేని స్థితి నెలకొంది. ఇప్పటికైనా తారురోడ్డు మంజూరు చేసి నిర్మించాలని కోరుతున్నారు.



బురదగా ఉన్న గడిమండ - గరికిబంద రహదారి



అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధుల బృందం

కాఫీ ఉత్పత్తులపై అవగాహన

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కాఫీ తయారీ ఉత్పత్తిపై వాల్ మార్ట్ ఫౌండేషన్, టెక్నో సర్వే సంస్థ బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అసోసియేట్ రాకేష్ మాట్లాడుతూ,అరకు కాఫీ ప్రపంచంలోనే మంచి ప్రాధాన్యత పొందిందన్నారు. జిల్లాలోని కాఫీ పంటని గిరి రైతులు ప్రధాన పంటగా పండిస్తున్నారని, పంట ఉత్పత్తులపై విద్యార్థులకు అవగాహన ఎంతో అవసరమని చెప్పారు. ఈ నేపథ్యంలోనే తమ సంస్థ ద్వారా మన ఊరు మన కాఫీ అనే నినాదంతో ప్రతి గ్రామంలోని పాఠశాలల్లోని కాఫీ ఉత్పత్తిపై అవగాహన సదస్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు. అంతకుముందు అరుకు కాఫీకు మిగతా ఫ్రెంచ్ ప్రెస్, ఏరోప్రెస్, పూర్వర్ కంపెనీల కాఫీలను తయారుచేసి విద్యార్థులకు రుచి చూపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల హాస్టల్ వెల్ఫేర్ అధికారి పి.రవికుమార్, ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి సైమన్, సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ సందీప్ దేరాన, సీనియర్ అసోసియేట్ ఎం రవికుమార్ రెడ్డి, బి,శ్యాముల, ప్రశాంత్, సీఆర్పీలు, స్వామి నాయుడు, బాలన్న పాల్గొన్నారు.



వ్యాపారితో మాట్లాడుతున్న సర్పంచ్

మార్కెట్‌లో షెడ్ల కేటాయింపు

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి మేజర్ పంచాయతీలో నాబార్డ్ సహకారంతో నిర్మించిన మార్కెట్ షెడ్లను బుధవారం స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్‌లు వ్యాపారస్తులకు షెడ్లలో స్థలాలు కేటాయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుష్పలత మాట్లాడుతూ, ప్రతి బుధవారం మార్కెట్ షెడ్లలోనే సంత జరపాలని, రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ కి అంతరాయం కలిగించరాదని సూచించారు. మార్కెట్ షెడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి దుకాణదారుడు చెత్తబుట్టను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.వ్యర్థాలను మురుగు కాలువలోకి పడేయడంతో నీరు స్తంభించిపోతుందని, దీంతో దోమలు, ఇతర కీటకాలు వృద్ధి చెంది వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు.

చెరువును తలపిస్తోన్న ప్రధాన రహదారి

గోతుల్లో వర్షపు నీరు చేయడంతో ప్రమాదకరంగా మారిన వైనం

ప్రజాశక్తి -సీలేరు

విశాఖపట్నం నుండి చింతపల్లి, జికె.వీధి, సీలేరు మీదగా, భద్రాచలం, ఇటు ఒడిశా వెళ్లే అంతరరాష్ట్ర రహదారి అత్యంత అధ్వానంగా చెరువును తలపించేలా ఉంది. జీకే వీధి మండల కేంద్రానికి కిలోమీటర్ల దూరంలో ఉన్న లంకపాకల వద్ద ఈ ప్రధాన రహదారి మొత్తం గోతులమయంగా ఉంది. వారం రోజుల నుంచి ఏజెన్సీలో విస్తీరంగా వర్షాలు కురుస్తుండడంతో ఈ గోతుల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారాయి దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. రహదారులు మరమ్మతులు చేయాలని అనేకసార్లు ఆర్ అండ్ బి అధికారులకు మొరపెట్టుకున్న ఎటువంటి చర్యలు చేపట్టలేదు. వర్షాలకు గుంతల్లో వర్షపు నీరు చేరి ఈ గోతు లోతు ఎంతో తెలియడం లేదు. దీంతో ఎటువంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విశాఖపట్నం నుంచి భద్రాచలం, ఒడిశా వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ఒడిస్సా నుంచి వందలాది లోడ్‌లతో భారీ లారీలు నిత్యం రాకపోకలు ఈ మార్గంలో సాగిస్తున్నాయి. రద్దీగా వాహనాలు తిరుగుతుండడంతో గోతుల్లో వర్షపు నీరు చేరి ఉండడంతో మరింత అధ్వానంగా రహదారి తయారైంది. రాత్రి సమయంలో వాహనాల రాకపోకలు సాగించేటప్పుడు లంకపాకల వద్ద మరింత సమస్యగా ఉంది. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన ఈ గోతుల్ని పూడ్చివేసి రహదారిని మెరుగుపరచాలని వాహనచోదకులు కోరుతున్నారు.



లంకపాకల వద్ద ప్రధాన రహదారిపై చెరువులను తలపిస్తున్న గుంతలు

చెక్ డ్యామ్‌కు మరమ్మతులు చేయరూ..

ప్రజాశక్తి -కొయ్యూరు

కొయ్యూరు మండలం దొడ్డవరం, తాళ్ళపాలెం గ్రామాల భూములకు సాగునీరు అందించే గైరమ్మ చెక్ డ్యామ్‌కు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ చెక్ డ్యామ్ కూలిపోయి రెండు సంవత్సరాలైనా నేటికీ దీనికి మరమ్మతులు చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులు చందాలు సమకూర్చుకొని తాత్కాలిక చెక్ డ్యామ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయమై పలుమార్లు ఐటీడీఏ పీవోకు స్పందనలో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టూ పక్కల సుమారు 1500 ఎకరాలకు సాగునీటిని అందించే ఈ గైరమ్మ చెక్ డ్యామ్‌ను అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దొడ్డవరం తాళ్లపాలెం మధ్య గైరమ్మ చెక్ డ్యామ్‌కు పూర్తిస్థాయిలో పనులు చేయించాలని సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన చెక్ డ్యామ్ ఇదే...

పిహెచ్‌సి వైద్యాధికారిని బదిలీ చేయాలి

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సౌమ్యను వెంటనే బదిలీ చేయాలని సీలేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ దుర్జో డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ రోగులకు వైద్య సేవలు అందించడంలో వైద్యాధికారి సౌమ్య పనితీరు బాగోలేదని ఆరోపించారు. దీనిపై గతంలో జిల్లా కలెక్టర్‌కి, పిఓకి ఫిర్యాదు చేయగా షోకాజ్ నోటీసు జారీ చేశారని గుర్తు చేశారు. ఇటీవల సీలేరులో స్వామి రమణ కుమారులు ఇద్దరికీ అనారోగ్య కారణంగా ఆసుపత్రికి తీసుకొస్తే తక్షణ వైద్య సేవలు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ డాక్టర్ సౌమ్య వారిపై కేకలు వేసి ఘర్షణ దిగడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ఇటీవల జికె.వీధి మండల సమావేశంలోనూ వైద్యాధికారి పనితీరును పర్యవేక్షించాలని ఎంపీడీవోకి లేఖ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్, పిఓ వెంటనే స్పందించి తక్షణమే వైద్యాధికారిని బదిలీ చేసి కొత్తవారిని నియమించాలని డిమాండ్ చేశారు.

29న జాతీయ అల్లూరి సంఘం ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-అడ్డతీగల

జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఆత్మీయ సమావేశం ఈనెల 29వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు అడ్డతీగల మండలం పైడిపుట్ట గ్రామంలోని అల్లూరి సీతారామరాజు రచ్చబండ వద్ద నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు చోడిశెట్టి సుబ్బారావు, జాతీయ కార్యదర్శులు రామన శ్రీనివాసరావు, వాడపల్లి శేషాచార్యులు తెలిపారు. ఆ రోజు రంపచోడవరం శాసనసభ్యులుగా ఎన్నికైన మిరియాల శిరీషాదేవికి అభినందన సత్కారం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం వారు ఎమ్మెల్యే శిరీషాదేవి కార్యాలయంలో ఆమెను కలిసి ఆహ్వానించారు.

19న జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యుల పర్యటన

ప్రజాశక్తి-పాడేరు: ఈ నెల 19వ తేదీ శుక్రవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు (ప్రభుత్వ కార్యదర్శి కేడర్) జతోతు హుస్సేన్ జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ సభ్యులు ఆ రోజు ఉదయం 10 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేరి రోడ్డు మార్గంలో పాడేరు చేరుకుంటారు. పాడేరు గిరిజన భవన్‌లో ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో పరస్పరం చర్చిస్తారు. అనంతరం 11 గంటలకు జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో, జిల్లా అధికారులతో నిర్వహించనున్న సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు అరకు వ్యాలీ సందర్శనకు బయలుదేరి వెళ్తారు. సాయంత్రం ఐదు గంటలకు హరిత హోటల్ గోష్టి సమావేశ మందిరంలో ఏపీ టూరిజం కార్పొరేషన్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం విశాఖపట్నం బయలుదేరి వెళ్తారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

19న 'మీకోసం' రద్దు

ఈ నెల 19వ తేదీన శుక్రవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుల పర్యటన నేపథ్యంలో శుక్రవారం పాడేరు ఐటి డిఏలో నిర్వహించనున్న మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ప్రకటించారు. మీకోసం కార్యక్రమం రద్దు చేసినందున ఆ రోజు ఫిర్యాదులు స్వీకరించబడవని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి మీకోసం కార్యక్రమానికి రావద్దని కలెక్టర్ సూచించారు.



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలోని హెచ్ పి పెట్రోల్ బంక్ వద్ద పాడేరు ఫైర్ స్టేషన్ సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. పెట్రోల్ బంకులో పెట్రోల్ లోడ్ చేస్తున్నప్పుడు మంటలు చెలరేగితే ఎలా అదుపు చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో బంక్ సూపర్‌వైజర్ జి.సత్యనారాయణ, ఎస్ఎఫ్ఒ ఎవి రమణ, ఎల్ఎఫ్ బి వెంకటేష్, ఫైర్ మేన్స్ జె శ్రీనాధ్, జి. సత్యబాబు పాల్గొన్నారు.



ఎంపిటిసి సభ్యురాలిని పరామర్శిస్తున్న ఎంపీ తనూజరాణి, మాజీ ఎమ్మెల్యే పాల్గుణ

ఎంపిటిసి సభ్యురాలికి పరామర్శ

ప్రజాశక్తి హుకుంపేట:కష్టాల్లో ఉన్నప్పుడు ఎల్లప్పుడు తోడుగా ఉంటామని అరుకు ఎంపి తనుజారాణి అన్నారు. మండలంలోని దాలిగుమ్మడి గ్రామంలో ఎంపీ, డాక్టర్ తనూజ రాణి, మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణతో కలిసి బుధవారం హుకుంపేట సెగ్మెంట్ ఎంపిటీసీ సభ్యురాలు కొమ్మ రమ భర్త సింహాచలం మృతి చెందిన విషయన్ని తెలుసుకుని కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి తోడుగా ఉంటానని ధైర్యం చెప్పారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ, ఎవరికి ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటానని తెలిపారు. పరామర్శించిన వారిలో వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి శామ్యూల్, స్థానిక సర్పంచ్ వెంకట పూర్ణిమ, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ వినయ్, వైసిపి నాయకులు అనిల్, కొండబాబు తదితరులు ఉన్నారు.

ప్రయివేటు కళాశాలల దౌర్జన్యంపై ఎస్ఎఫ్ఐ నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.గీతాకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మొహరం రోజున నర్సీపట్నంలో ప్రైవేటు కళాశాలలు తెరుచుకోవడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు అక్కడకు వెళ్లారు. ప్రైవేట్ కళాశాలలు నచ్చినట్లుగా నడుపుకుంటున్నారని గీతాకృష్ణ అన్నారు. నర్సీపట్నం ఆదిత్య కళాశాల, శ్రీసాయి కళాశాలలకు వెళ్లి ప్రభుత్వ సెలవు రోజు కళాశాల ఎందుకు పెట్టారని అడిగితే దురుసుగా సమాధానం ఇస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులను బయట గెంటేశారన్నారు. శ్రీసాయి కళాశాల యాజమాన్యం దౌర్జన్యం చేయడంపై నర్సీపట్నం ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ గౌతం, ఎస్ఎఫ్ఐ డివిజన్ సభ్యులు జనార్దన్, రాయుడు, మను, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాయి(ఎన్టీఆర్) కళాశాలపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

నర్సీపట్నంలో శ్రీసాయి(ఎన్టీఆర్) కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, మొహరం ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికి నర్సీపట్నంలో శ్రీసాయి(ఎన్టీఆర్) కళాశాల, ఇతర ప్రైవేటు కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించారన్నారు. దీన్ని ప్రశ్నించిన ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి కళాశాల యాజమాన్యాన్ని తరగతుల నిర్వహణపై అడగ్గా కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది దౌర్జన్యంగా ఎస్ఎఫ్ఐ నాయకులను మెడ పట్టి నెట్టి దుర్భాషలాడి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నర్సీపట్నంలో ప్రైవేటు కళాశాలలు పై ఉన్నత విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సంఘటన పై జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారులు, కలెక్టర్, బాలల హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని ఆయన వెల్లడించారు.

ఎర్రమట్టి దిబ్బల విధ్వంసం ఆపాలి

ఎయు భూములపై సమగ్ర విచారణ జరపాలి

జిల్లా కలెక్టర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు వినతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ-భీమిలి సాగర తీరంలో వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఎర్రమట్టి దిబ్బలు విధ్వంసానికి గురికావడం అత్యంత ఆందోళనకరమని, స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు భారీ యంత్రాలను ఉపయోగించి ధ్వంసం చేస్తున్నారని, తక్షణమే ఆ విధ్వంసం ఆపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు బుధవారం ఆయన వినతిపత్రం అందించారు. ఎర్రమట్టి దిబ్బలు పర్యావరణాన్ని పరిరక్షించేవి, రక్షణ రంగానికి రక్షణ కవచాలుగా ఉన్నాయని వివరించారు. చారిత్రాత్మకమైన ప్రకృతి సంపద అని, భూగర్భ జలాలను రక్షించేవని, జాతీయ భౌగోళిక వారసత్వ సంపదగా ప్రభుత్వం దీనిని గుర్తించిందని, వీటి ధ్వంసం వల్ల పర్యావరణానికి ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. అపారమైన ఈ సహజ సిద్ధ ప్రకృతి సంపద కొద్దిమంది వ్యక్తుల దాహానికి బలికావడం అత్యంత ఆందోళనకరమని, ప్రజలు, పర్యావరణవేత్తలు సైతం తీవ్ర ఆవేదనతో ఉన్నారని పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ వెంటనే కలుగచేసుకొని ధ్వంసం చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ ప్రకృతి సంపదను రక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

ఎయు భూములపై సమగ్ర విచారణ జరపాలి

విశాఖ నగరంలోని ఆంధ్రా యూనివర్శిటీకి సంబంధించిన సుమారు 2.5 ఎకరాల భూములను స్వాహా చేయడానికి కొందరు రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు సిద్ధపడుతున్నారని, ఎయు పోలమాంబ గుడి పక్కన 5 ఎకరాల భూమిలో గతంలో ప్రభుత్వం కొంతమంది పేదలకు కొంత భూమిని బదలాయించిందని, ఈ 5 ఎకరాల్లో పేదలకు కేటాయించగా మిగతా 2.5 ఎకరాల భూమిని క్రీడామైదానం కోసం ప్రభుత్వం కేటాయించినట్లు తెలిసిందని, వందల కోట్లు విలువైన ఈ భూమిని స్వాహా చేసి నిర్మాణాలు చేపట్టేందుకు కొంతమంది రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు సిద్ధపడుతున్నారని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై కలెక్టర వెంటనే కలుగచేసుకొని ఎయు భూముల ఆక్రమణలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎయు భూములు రక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కథనాలపై స్పందించిన అధికారులు

ఎంవిపి.కాలనీ : భీమిలి వద్ద ఉన్న ఎర్రమట్టి దిబ్బలు తవ్వకాలపై బుధవారం పత్రికల్లో వచ్చిన వార్తలపై అధికారులు స్పందించారు. ఈ భూములు జివిఎంసి పరిధిలోకి వస్తాయని, జివిఎంసి అధికారాల ప్రకారం నేరెళ్ల వలస గ్రామంలో అనుమతులు జారీ చేయుటకు అనధికారిక అభివృద్ధి తదితరాలపై చర్యలు తీసుకోవడానికి జివిఎంసిమాత్రమే అధికారం ఉందని, భీమిలి మ్యూచువల్ కో-ఆపరేటివ్ బిల్డింగ్స్ సొసైటీకి విఎంఆర్‌డిఎ నుంచి ఎటువంటి అభివృద్ధి అనుమతులు జారీ చేయలేదని విఎంఆర్‌డిఎ ముఖ్య ప్రణాళిక అధికారి కె.సంజయ్ రత్నకుమార్ తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా : ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కారానికి పటిష్ట చర్యలు తీసుకుంటానని అనకాపల్లి ఎస్‌పి ఎం.దీపిక అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె బుధవారం ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ప్రతి సోమవారమూ నేరుగా తనను కలవొచ్చాన్నారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేక నిఘా పెడతామని చెప్పారు. వంద రోజుల ప్రణాళిక అమలుకు కృషి చేస్తామన్నారు. మహిళలు, పిల్లల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. నేర ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట పోలీసు బీట్స్ ఏర్పాటుచేస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ తదితర సమస్యలపై కేంద్రీకరించనున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందిస్తానని తెలిపారు.

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌పి దీపికను అదనపు ఎస్‌పి బి.విజయభాస్కర్, అనకాపల్లి డిఎస్‌పి ఎస్.అప్పలరాజు, పరవాడ డిఎస్‌పి కెవి.సత్యనారాయణ, ఎస్‌బి డిఎస్‌బి బి.అప్పారావు, ఎఆర్ డిఎస్‌పి పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, బుచ్చిరాజు, గణేష్, కుమారస్వామి, మన్మధరావు, సతీష్, నరసింహమూర్తి, సంజీవరావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

వసంత్ కెమికల్స్‌లో...

రియాక్టర్ పేలి ఒకరు మృతి

◆రూ.35 లక్షల పరిహారానికి యాజమాన్యం అంగీకారం

◆విచారణకు ఆదేశించిన కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, రాంబిల్లి, అనకాపల్లి విలేకర్లు: అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం సెజ్ పరిధి రాంబిల్లి మండలంలోని లాలం కోడూరు శివారులో ఉన్న వసంత్ కెమికల్స్‌లో బుధవారం రియాక్టర్ పేలడంతో ఒడిశాకు చెందిన ప్రదీప్ రౌత్(44) అక్కడికక్కడే మరణించాడు. మృతిచెందిన ప్రదీప్ రౌత్ కంపెనీలో హౌస్ కీపింగ్ చేస్తున్నాడు. బుధవారం ఉదయం 6 గంటలకు విధులకు హాజరయ్యాడు. 8.30 గంటల సమయంలో రియాక్టర్ పేలి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ సమయంలో కేవింగ్ పనులకు అక్కడికి వెళ్లాడని యాజమాన్య ప్రతినిధులు, పోలీసులు చెబుతున్నారు.

ప్రమాదంలో మరణించిన ప్రదీప్‌రౌత్ కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కంపెనీ యాజమాన్యం రూ.35 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు అంగీకరించినట్లు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. దీంతో పాటు ఇఎస్ఐ బెనిఫిట్స్ కూడా కుటుంబ సభ్యులకు అందించనున్నట్లు చెప్పారు. ప్రమాదంలో మరణించిన ప్రదీప్‌రౌత్ భార్య, ఇద్దరు పిల్లలు ఒడిశా నుంచి అనకాపల్లి వస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రమాదంపై విచారణకు రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన జనరల్ మేనేజర్ ఇండస్ట్రీస్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఫర్ విఎస్ఇజెడ్, డిస్టిక్ ఫైర్ ఆఫీసర్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్, ఎపిపిసిబి ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో కమిటీ విచారణ చేపట్టి నివేదికను 7 రోజులలోపు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

రెండు ఇసుక లారీలు పట్టివేత

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:రాజమండ్రి నుంచి నర్సీపట్నంకు ఇసుక తరలిస్తున్న ఒక టిప్పర్, మరో 12 టైర్ల లారీని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో (ఎస్.ఇ.బి.) అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఈ లారీలను సీజ్ చేసి నర్సీపట్నం ఎస్ఇబి స్టేషన్‌కు తరలించారు. 12 టైర్ల లారీకి రూ.50 వేలు, 10 టైర్ ల టిప్పర్ కు 25 వేల చొప్పున అపరాధ రుసుం విపించామని ఎస్ఇబి సీఐ సురేష్ కుమార్ తెలిపారు.
ఇదిలా ఉండగా రాజమండ్రి ఇసుక రీచ్ వద్ద ఆధార్ కార్డు చూపించి టన్ను ఇసుక కు 275 రూపాయలు చెల్లించి, ఇసుకను కొనుగోలు చేసి, తీసుకు వస్తున్నట్టు తెలిసింది. రవాణా చార్జీలు కలుపుకొని ఇక్కడ విక్రయిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం పేరుతో నిర్మాణాలు చేసుకునే వారికి వెసులుబాటు కల్పించింది. ఎవరైనా భవన నిర్మాణాలు చేసుకుంటే, వారి ఆధార్ కార్డు చూపిస్తే, వారికి ఉచితంగా ఇసుక సరఫరా చేస్తారు. రాజమండ్రి గోదావరి ఇసుక రీచ్‌లో ఆధార్ కార్డు చూపించి ఇసుకను కొనుగోలు చేసి వాహన యజమానులు నర్సీపట్నం తరలిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం మూడు ట్రాక్టర్ల ద్వారా ద్వారా ఇసుకను నర్సీపట్నం తరలిస్తుండగా వాటిని కూడా ఎస్ఇబి అధికారులు పట్టుకున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు పదివేల రూపాయలు అపరాధ రుసుం విధించారు.

వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు కండక్టర్ చిట్టిబాబుపై చేయి చేసుకున్న వ్యక్తిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కండక్టర్ తెలిపిన వివరాల ప్రకారం నర్సీపట్నం నుండి తోటకూరపాలెం నడుపుతున్న బస్సు సర్వీసులో కండక్టర్ చిట్టిబాబు కొండల అగ్రహారం గ్రామానికి చెందిన సుర్ల వెంకటేష్‌ను టిక్కెట్టు తీసుకోమని అడిగారు. వెంకటేష్ దురుసుగా ప్రవర్తించి కొట్టాడని కండక్టర్ తెలిపారు. ఇదే రూట్లో తరచుగా దాడులు చేస్తున్నారని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళల రక్షణకు ప్రాధాన్యత

- గాజువాక డిసిపి2 తుహిన్ సిన్హా



గాజువాక డిసిపి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-గాజువాక: మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యతనిచ్చి చర్యలు తీసుకుంటానని గాజువాక జోన్ డిసిపి -2 తుహిన్ సిన్హా స్పష్టం చేశారు. బుధవారం స్థానిక పోలీస్ కాంప్లెక్స్‌లో డిసిపిగా బాధ్యతలు స్వీకరించారు. 2017 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన తుహిన్ సిన్హా ఉత్తరప్రదేశ్ లక్నోకు చెందినవారు. అల్లూరి జిల్లా ఎస్‌పిగా పనిచేస్తూ, గాజువాక డిసిపిగా బదిలీపై వచ్చారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల నుండి విశాఖకు వివిధ మార్గాల ద్వారా వచ్చే గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నగర శివార్లతో ముమ్మర తనిఖీలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు ఏసిపిలతోపాటు సిఐలు,ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందిచారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలపై వినతి

ప్రజాశక్తి -గాజువాక: రాష్ట్రంలో చిన్న పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల సంఘం (అప్సా) ఉత్తరాంధ్ర నాయకులు కోరారు. బుధవారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు అనంతరం సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల గుర్తింపు రెన్యువల్ కాలపరిమితిని గతంలో మాదిరిగా పదేళ్లకు పొడిగించాలని, విద్యాహక్కు చట్టం ద్వారా గడచిన మూడేళ్లలో ప్రైవేటు బడుల్లో ఉచిత ప్రవేశాలు పొందిన విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, మారిన పదవ తరగతి సిలబస్‌ను విద్యార్థుల ఒత్తిడిని దృష్టిలో పెట్టుకుని తగ్గించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే పల్లా స్పందిస్తూ, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అప్సా సంఘం నాయకులు ఎం.జనార్ధన్, టి. సింహాచలం, పి. భాస్కరరావు, రామకృష్ణ, గణపతిరావు, సత్యం, మురళీ, శ్రీనివాస్, రమేష్ ఉన్నారు.

వైసిపి భూఅక్రమాలపై చట్టపరమైన చర్యలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : వైసిపి ప్రభుత్వ పాలనలో భారీ భూదోపిడీ జరిగిందని ఎమ్మెల్యే పి.గణబాబు ఆరోపించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.ఒక లక్ష 90వేలు కోట్లు భూ అక్రమాలు గత వైసిపి పాలనలో జరిగాయన్నారు. భూ దోపిడీలు, అక్రమాల పై కూటమి ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేసిందన్నారు. విశాఖలో కూడా భారీ భూదోపిడీకిజరిగిందని, రుషికొండలో రూ.500 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి జగన్ రెడ్డి ప్యాలస్ నిర్మించారన్నారు. వీటన్నింటిపైనా కూటమి ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

ఆర్‌టిసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆర్‌టిసిలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎపిపిటిడి (ఆర్‌టిసి) రాష్ట్ర ప్రసార కార్యదర్శి బి మధుసూధనరావు కోరారు. బుధవారం విశాఖఉత్తరఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును కలిసి విన్నవించారు.
ఆర్‌టిసిలో రెండు దశాబ్దాలుగా 7300 అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను వివిధ విభాగాల్లో రెగ్యులర్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నారని, వారికి సమాన వేతనంగానీ, ఉద్యోగ భద్రత గానీ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రమాద బీమా కల్పిస్తూ, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, మహిళా ఉద్యోగులకు మెటర్నటీ లీవ్స్ కల్పించాలని కోరారు. వీరికి వారాంతపు సెలవులతోపాటు ప్రభుత్వ సెలవు దినాలు వర్తించేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు స్పందించి, సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.కార్యక్రమంలో సిఐటియు నాయకులు పడాల గోవిందు, కిరణ్, మోహన్, సతీష్, శ్రీను.పాల్గొన్నారు.

అంగన్వాడీ కోడిగుడ్లు పక్కదోవ!

పట్టుకున్న కుమ్మరితోట గ్రామస్తులు

ప్రజాశక్తి-సీలేరు : అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ప్రభుత్వ సరఫరా చేసే కోడి గుడ్లను అక్రమంగా తరలిస్తుండగా మంగళవారం రాత్రి జికె.వీధి మండలం దారకొండ పంచాయతీ, కమ్మరితోట గ్రామస్తులు పట్టుకున్నారు. కమ్మరితోట అంగన్వాడీ కేంద్రం టీచరు రెడ్డి జయంతి భర్త రాంబాబు మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో దారకొండ వ్యాపారులకు ఐదు అట్టల (150)తో గుడ్లు విక్రయించేందుకు తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పిల్లలకు పోషకాహారం నిమిత్తం ప్రభుత్వం ఇచ్చే గుడ్లు వారికి పెట్టకుండా అక్రమంగా విక్రయాలు జరపడం దారుణమన్నారు. గుడ్లు అక్రమంగా ఎందుకు తరలిస్తున్నారని అంగన్వాడీ టీచర్ రెడ్డి జయంతి నిలదీయగా తప్పు అయిపోయింది, నన్ను క్షమించండి అని ఆమె చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సంఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



గ్రామస్తులు పట్టుకున్న అంగన్వాడీ కోడిగుడ్లు

గీతం ప్రవేశాలకు అనూహ్య స్పందన



గీతం ప్రవేశాలకు వచ్చిన విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ: గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సులలో ప్రవేశాలకు అనూహ్య స్పందన కనిపిస్తోంది. బుధవారం ప్రవేశం పొందిన విద్యార్థులకు సర్టిఫికేట్ల పరిశీలన, అవగాహన తరగతులను నిర్వహించారు. గీతంలో ఇంజనీరింగ్, మేనేజ్మెంట్, లా, ఆర్కిటెక్చర్, మెడికల్, పారామెడికల్, ఫార్మశీ, నర్సింగ్, ఫిజియోథెరిపి వంటి వృత్తి విద్యాకోర్సులతో పాటు బిఎస్‌సి, బిఎ, బికామ్ వంటి డిగ్రీ కోర్సులలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఈ అవగాహన తరగతులను నిర్వహించారు.

ఈ సందర్భంగా గీతం ఇన్‌ఛార్జి విసి ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు మాట్లాడుతూ, నూతన విద్యా విధానానికి అనుగుణంగా గీతం కోర్సుల రూపకల్పనతోపాటు నిపుణులతో విద్యాబోధన సాగుతుందన్నారు.ప్రతిభ చూపిన విద్యార్థులకు ఏటా రూ.50 కోట్ల ఉపకారవేతనాలను అందజేస్తున్నామన్నారు. వర్సిటీలో రూ.వంద కోట్లతో నూతన సాంకేతిక పరిజ్ఞానం అధునాతన ప్రయోగశాలలతో పాటు, ప్రవేశం నుంచి డిగ్రీ అందుకుని వెళ్ళేంతవరకు మార్గదర్శకం చేసేలా గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విద్యార్థులలో స్టార్టప్ సంస్కృతిని పెంచడానికి వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ ఉందన్నారు.
గీతం ఎక్స్టర్నల్ రిలేషన్స్ డిప్యూటీ డైరక్టర్ నవీన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా లక్ష మంది పైగా గీతం పూర్వ విద్యార్థులు కీలక పదవులలో ఉన్నారని, ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకం చేయడానికి వారి సహకారం తీసుకుంటున్నామన్నారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ అడ్మిషన్ల విభాగం అధికారులు, సీనియర్ అధ్యాపకులు పాల్గొన్నారు.బుధవారం నిర్వహించిన అవగాహనలో ఇంటర్మీడియట్ తత్సమాన కోర్సులు పూర్తి చేసిన వారికి బిఎస్‌సి బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, స్టాటస్టిక్స్, బిసిఎ, ఫిజియోథెరిపి, బిఫార్మశీతో పాటు బిఎ ఎల్ఎల్‌బి, బిబిఎ, బిఎలో ఎకనామిక్స్, హిస్టరి, ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, సోషియాలజి కోర్సులు మేజర్, మైనర్ సబ్జెక్టుల ఎంపిక, గీతంలోని వివిధ సదుపాయాలను ఆయా విభాగాధిపతులు, సీనియర్ ప్రొఫెసర్లు వివరించారు.

రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని విధాన నిర్ణయాలు తీసుకోవాలి


ప్రజాశక్తి- మాధవధార : రాష్ట్రం, భావితరాల భవిష్యత్‌కు ఉపయోగపడేలా సరైన నిర్ణయాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగించాలని రాష్ట్ర కాంగ్రెస్ ఒబిసి విభాగం ఛైర్మన్ మూల వెంకటరావు అన్నారు. ప్రస్తుతం రాష్ట్రం ఉన్న పరిస్థితుల దృష్ట్యా పాలనలో ప్రయోగాలు చేసే సాహసం చేయకుండా, తనకున్న సుదీర్ఘ రాజకీయ అనుభవంతో మేథావులు, నిపుణుల సలహాలు సూచనలతో మెరుగైన పాలన అందించేందుకు కృషి చేయాలన్నారు. యువతకు, సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యతనిచ్చి మంత్రివర్గంలో పాత కొత్త కలయికలకు చోటు కల్పించడం అభినందనీయమన్నారు. ఇదే సమయంలో వారితో సమర్థవంతంగా పనిచేయించే బాధ్యత అనుభవజ్ఞుడిగా చంద్రబాబు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రభుత్వ సలహాదారులు, సీనియర్ అధికారుల సహకారం తీసుకోవాలని కోరారు.

వృద్ధాప్య పింఛను ఇచ్చి ఆదుకోండి

ప్రజాశక్తి- గాజువాక : విశ్రాంత ఉద్యోగులకు ఆర్‌టిసి ఇచ్చే నామమాత్రపు పెన్షన్‌తో కుటుంబంతో జీవనం కష్టమౌతోందని, తమకు ఎన్‌టిఆర్ భరోసా కింద ఇచ్చే సామాజిక పింఛన్‌కు అర్హులుగా గుర్తించి, పెన్షన్ అందజేసి ఆదుకోవాలని ఎపిఎస్‌ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు కోరారు. బుధవారం గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. 2014నుంచి ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగులకు ప్రతినెలా కేవలం రూ.వెయ్యి మాత్రమే పెన్షన్ ఇస్తున్నారని, దీనిపై గత ప్రభుత్వానికి పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందించలేదన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. దీనిపై గాజువాక ఎమ్మెల్యే పల్లా స్పందిస్తూ, సమస్యను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. పల్లాను కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వివికె రాయ్, ప్రధాన కార్యదర్శి కెఆర్ ఆంజనేయులు, కెవిఆర్‌కె ప్రసాద్ ఉన్నారు.

ఎండిన భారీ వృక్షాన్ని తొలగించరూ.!

ప్రజాశక్తి- విఆర్.పురం : విఆర్.పురం -రేఖపల్లి ప్రధాన రహదారి మార్గ మధ్యలో ముత్యాలమ్మ గుడి ఎదురుగా రోడ్డు పక్కన ఎండిపోయిన భారీ వృక్షం ప్రమాకరంగా ఉంది. ప్రస్తుతం వర్షాలు పడుతున్న తరుణంలో ఆ వృక్షం ఎప్పుడు నేలకొరిగి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. ఎండిన చెట్టు, అందులో పెద్దది కావడంతో పాదచారులు భయపడుతున్నారు. ముందు జాగ్రత్త చర్యగా ఆ చెట్టును తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు దీనిపై తక్షణమే స్పందించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.



రేఖపల్లి రోడ్డులో ఎండిన చెట్టు

ప్రమాదభరితంగా పోచవరం రహదారి

రోడ్డుపైకి ఏపుగా పెరిగిన పొదలు : గోతులతో ఇబ్బందులు

ప్రజాశక్తి-విఆర్.పురం :మండలంలోని ప్రధాన పర్యాటక ప్రాంతమైన పోచవరం జీడిగుప్ప వెళ్లే ఆర్ అండ్ బి రహదారి అధ్వానంగా ఉంది. రోడ్డు మధ్యలో గోతులు ఉండడంతో వర్షాలకు ఆ గుంతల్లో నీరు చేరి వాహనదారులకు ప్రమాదాలకు గురవుతున్నారు. మరో వైపు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పొదలు పెరిగాయి. దీంతో రోడ్డుపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని దుస్థితి నెలకొంది. ఇరువైపులా ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి ఏపుగా పెరిగిన పొదలను తొలగించాలని, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రోడ్డులో ఉన్న గోతులను పూడ్చాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

గిరి ప్రదక్షిణ భక్తులకు ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఈ నెల 20న సింహగిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు అవసరమైన వైద్యసాయం అందించేందుకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పోర్టు స్టేడియం వెనుక రోడ్డులో వినాయక రెసిడెన్సీ వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గ్రేటర్ విశాఖ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎమ్‌డి. యాసిన్ తెలిపారు. బుధవారం ద్వారకానగర్‌లోని తన కార్యాలయంలో మీడియాకు వివరాలను వెల్లడించారు. వీ హెల్త్ కేర్, ఏజ్ కేర్ ఫౌండేషన్, ఎరుమేలు శ్రీ అయ్యప్ప అన్నసమారాధన సేవా ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో 30 మంది వైద్యులు, సిబ్బందిని మూడు 3 వైద్య బందాలుగా ఏర్పాటుచేసి, 12 గంటల పాటు నిర్విరామంగా వైద్య సేవలు అందించేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఆరోగ్య పరీక్షల తోపాటు ఉచితంగా మందులు అందజేస్తామని, అత్యవసర పరిస్థితిల్లో మెరుగైన ఆసుపత్రులకు తరలించేందుకు అంబులెన్స్ సర్వీసును అందుబాటులో ఉంచుతామన్నారు. భక్తులకు వైద్య సేవలు అందించేందుకు పలువురు డాక్టర్లు, వైద్య సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని, ఫిజియోథెరపిస్టుల సేవలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ చింతా నేతాజీ, కమ్యూనిటీ మెడికల్ సర్వీసు డైరెక్టర్ డా. ఎన్. ఎస్. రాజు, రోటరీయన్స్ శంకర్, కే.ఎమ్. కే. రమేష్, వి.ప్రవీణ్, సూర్య తేజ పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో టైప్ రైటింగ్ పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : ఎపి సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 35 టైప్ రైటింగ్ పరీక్షా కేంద్రాల్లో ఈ ఏడాది సెప్టెంబర్ 28,29 తేదీల్లో ఇంగ్లీష్, తెలుగు భాషల్లో లోయర్, హయ్యర్ గ్రేడ్‌లు, హిందీలో లోయర్, హయ్యర్ గ్రేడ్‌లు, ఇంగ్లీష్ జూనియర్ గ్రేడ్‌లలో టైప్ రైటింగ్ పరీక్షలు జరుగుతాయని చిట్టివలస, లక్ష్మీ టైప్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్, జిల్లా టైప్ రైటింగ్ అండ్ షార్ట్‌హ్యాండ్ అసోసియేషన్ సభ్యులు బల్లా వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే నెల 21,22 తేదీల్లో షార్ట్ హ్యాండ్ పరీక్షలు రాష్ట్రంలోని 6 కేంద్రాల్లో జరుగుతాయని తెలిపారు సంబంధిత పరీక్షలకు సుమారు 70 రోజులు సమయం ఉన్నందున దగ్గర్లో వున్న గుర్తింపు పొందిన టైప్ ఇనిస్టిట్యూట్‌ను సంప్రదించి సమయాన్ని వథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు